
ప్రజాశక్తి

సోమవారం 7 నవంబర్ 2022 5 విజయనగరం



కెజిబివిల పటిష్టతకు ప్రణాళిక

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కెజిబివిల బలోపేతానికి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో జిల్లాలోని కెజిబివిల ప్రిన్సిపల్స్, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ప్రయోగాత్మకంగా చేపట్టిన సూపర్ 60 ప్రోగ్రాం విజయం సాధించిన విషయం గుర్తుచేశారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాలలో జిల్లాలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఇప్పటినుంచే ప్లాన్ ఆఫ్ యాక్షన్ వేయాలని తెలిపారు. ఇందులో భాగంగా 'సెమినార్ బేస్డ్ ప్రోగ్రాం'ను పాఠశాలలో ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. ఇందుకోసం ఇంటర్నల్ మోనిటరింగ్ కమిటీని కూడా నియమించడం జరిగిందన్నారు. పాఠశాలలో సిబ్బంది సెల్ఫోన్ వాడకూడదని చెప్పారు. ఇక నుంచి విద్యార్థినులకు వడ్డించే భోజనాల్లో కచ్చితమైన కొలత పాటించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎపిసి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ పి. మాలతి పాల్గొన్నారు.

జిల్లాలో సమగ్ర శిక్ష కార్యాలయంలో వ్యవహారాలన్నీ అడ్డగోలుగా సాగిపోతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనలను బేఖాతర్ చేస్తూ, నోటిఫికేషన్లు లేకుండానే పోస్టులను భర్తీ చేసుకుంటూ ఎపిసి సొమ్ము చేసుకుంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు కెజిబివిల తనిఖీ పేరుతో సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అయితే జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతోనే ఈ పనులన్నింటినీ సాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.



సమగ్ర శిక్షలో ఇష్టారాజ్యం

నోటిఫికేషన్ లేకుండా పోస్టుల భర్తీ?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత కొంతకాలంగా సమగ్ర శిక్షలో కార్యక్రమాలన్నీ ఇష్టారాజ్యంగా సాగుతున్నాయని తెలుస్తోంది. డిగ్రీ కళాశాల లెక్చరర్గా పనిచేస్తున్న ప్రస్తుత ఎపిసి ఏడాది కాలానికి గాను సమగ్ర శిక్షలో పనిచేసేందుకు డెప్యుటేషన్పై వచ్చారు. ఈ ఏడాది డెప్యుటేషన్ కాలం కూడా పూర్తికాగా, ఇదే శాఖలో కొనసాగేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఆయన డెప్యుటేషన్ కొనసాగింపు ఫైల్ పెండింగ్లో ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధులు ఆయనను కొనసాగింపుపై వ్యతిరేకత వ్యక్తం చేయడమే అందుకు కారణమని తెలిసింది. ఎపిసి వైఖరి పట్ల జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

ఇటీవల కాలంలో నోటిఫికేషన్ ఇవ్వకుండానే సమగ్ర శిక్షలో సుమారు 70 అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా కలెక్టర్ వద్దకు ఫైల్ను పంపి కెజిబివిల్లో అకౌంటెంట్, కుక్, అటెండర్, స్వీపర్, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం. రాష్ట్ర విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఈ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఈ పోస్టులను భర్తీ చేశారని తెలిసింది. సమగ్ర శిక్ష ఎపిసి ఉన్నప్పటికీ డిఇఒ ఎక్స్ అఫిషియో కో-ఆర్డినేటర్గా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ చైర్మన్గా ఉంటారు. డిఇఒ వద్దకు ఫైల్ పంపించకుండానే మొత్తం ఫైళ్లన్నీ ఎపిసి నుంచి కలెక్టర్కు నేరుగా చేరుతున్నట్లు కార్యాలయ సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

కెజిబివి సిబ్బందిపై వేధింపులు

ఎపిసి నిత్యం కెజిబివిలను తనిఖీలు చేస్తూ ప్రిన్సిపాల్స్ను, టీచర్లను వేధిస్తున్నారన్న ఆరోపణలు కొన్ని నెలలుగా వస్తున్నాయి. నిత్యం ఏదో ఒక పాఠశాలకు వెళ్ళి, హాజరు పట్టికలను తనిఖీ చేస్తూ, చిన్నపాటి పొరపాట్లను కూడా మెమోలు జారీతోపాటు భయభ్రాంతులకు గురిచేయడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు సకాలంలో హాజరైనప్పటికీ ఏదో ఒక కారణం చూపి సిబ్బంది, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఎపిసి వ్యవహారంపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్ని విమర్శలు ఉన్నా జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు విస్మయం చెందుతున్నారు.

ఎపిసి వ్యవహార శైలిపై రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు

ఎపిసి డెప్యుటేషన్ కాలం గత సెప్టెంబర్తో ముగిసింది. ఇప్పటికే జిల్లాలో ఆయన వ్యవహార శైలిపై రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల జిల్లాలో సమగ్ర శిక్షలో పని చేసిన గణాంక అధికారి రమణారెడ్డిని సరెండర్ చేయడంతో ఆయన రాష్ట్ర ప్రాజెక్టు అధికారికి ఎపిసిపై ఫిర్యాదు చేశారు. మెంటాడ కెజిబివి ప్రిన్సిపల్ ప్రమీలాదేవిని అక్రమంగా తొలగించడంతో ఆమె రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరిద్దరి ఫిర్యాదు మేరకు ఎపిసి స్వామినాయుడుపై విచారణకు ఆర్జెడిని నియమించారు. దీంతో ఎపిసిపై కొద్ది రోజుల క్రితం విచారణ జరిగింది.

జీవనశైలిలో మార్పు రావాలి

- హెల్త్, వెల్నెస్ కార్యక్రమం ద్వారా అవగాహన
- వైద్యారోగ్య సేవలపై సమీక్షించిన సిఆర్ఎం బృందం
- జిల్లాలో అందుతున్న సేవలపై సంతృప్తి



వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమైన సిఆర్ఎం బృందం సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతిఒక్కరికీ శారీరక వ్యాయామం చాలా అవసరమని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సి ఉందని జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతినిధి బృందం అభిప్రాయపడింది. దీనికోసం హెల్త్, వెల్నెస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిందని తెలిపింది. ప్రజల జీవనశైలిలో మార్పు రావాలని వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్కు చెందిన 15వ సిఆర్ఎం (కామన్ రివ్యూ మిషన్) బృందం ఆదివారం జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా వైద్యారోగ్య రంగానికి చెందిన వివిధ విభాగాల అధిపతులతో కలెక్టరేట్లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బృందం సభ్యులు డాక్టర్ రంజన్ కుమార్ చౌదరి, డాక్టర్ అంకుర్ నాయర్, విశాల్ కటారియా, డాక్టర్ విజయ్ రజనా, డాక్టర్ శ్వేతాశర్మ, డాక్టర్ మోనికా షైనీ, డాక్టర్ కె.శ్రీనివాస్తోపాటు వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. డిఎంహెచ్ఒ ఎస్వి రమణకుమారి, ఆయా విభాగాల అధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో వైద్యారోగ్య కార్యక్రమాలు, ఈ రంగంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గణాంకాలతో సహా వివరించారు. జిల్లాలో అందిస్తున్న సేవలు, కార్యక్రమాలపై బృందం సభ్యులు ఆరా తీశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రంజన్ కుమార్ చౌదరి మాట్లాడుతూ జిల్లాలో వైద్యారోగ్య రంగం పనితీరును అభినందించారు. ముఖ్యంగా డయాలసిస్ లాంటి సేవలను మెరుగుపర్చి, ఇఎన్డిపి పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. ఆశా వర్కర్లు మొబైల్ ఫోన్ ద్వారా అందిస్తున్న సేవలను తెలుసుకొని ప్రశంసించారు. 108, 104, 102 తల్లిబిడ్డా ఎక్స్ప్రెస్ సేవల గురించి క్షుణ్ణంగా ఆరా తీసి, సంతృప్తి వ్యక్తం చేశారు. శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం వల్ల ఆడపిల్లలు, కాన్పు సమయంలో పలు ఇబ్బందులు పడుతున్నారని ప్రముఖ గైనకాలజిస్ట్ గేదెల సన్యాసమ్మ బృందం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై బృందం సభ్యులు స్పందిస్తూ ప్రజల జీవనశైలిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక వ్యాయామాన్ని అలవర్చుకోవాలన్నారు. దీనికోసమే ప్రభుత్వం హెల్త్ అండ్ వెల్నెస్ కార్యక్రమం కింద యోగా, వ్యాయామానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. స్కూల్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రతీ ప్రభుత్వ, అనుబంధ పాఠశాలల్లో త్వరలో అమలు చేయనున్నామని చెప్పారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చి, వ్యాయామ పాఠాలను బోధిస్తామన్నారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, డిఆర్డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఒ పద్మలీల, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బృందం సభ్యులు సర్వజన ఆస్పత్రిని, ఘోషాస్పత్రిని సందర్శించారు.

వైద్యారోగ్య రంగంలో మెరుగైన సేవలు : కలెక్టర్

జిల్లాలో వైద్యారోగ్యశాఖల పరంగా మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. జాతీయ ఆరోగ్యమిషన్ బృందంతో తన ఛాంబర్లో భేటీ అయ్యారు. జిల్లాలో ప్రజలకు అందిస్తున్న వైద్యారోగ్య సేవలను కలెక్టర్ వివరించారు. వైద్యసేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ వైద్యకళాశాల అందుబాటులోకి వస్తే, మరిన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం అందిస్తున్న పోషకాహార పంపిణీని వివరించారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం సచివాలయాల ద్వారా ప్రతీ 2000 మందికి ఒక మహిళా పోలీస్ను ప్రభుత్వం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.



వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వైసిపి ఆధ్వర్యాన విజయోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిఎం జగన్ పాదయాత్ర చేపట్టి ఐదేళ్లయిన సందర్భంగా ఆదివారం నగరంలో వైసిపి శ్రేణులు విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాయి. నగరపాలక సంస్థ కార్యాలయం వద్దనున్న వైఎస్ఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేకను కట్ చేశారు. వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్వివి రాజేష్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి : జనసేన

విజయనగరం టౌన్ : జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చివేసే సమయం దగ్గరపడిందని జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆదాడ మోహనరావు అన్నారు. ఆదివారం స్థానిక బాలాజీ జంక్షన్ వద్దనున్న అంబేద్కర్ సామజిక భవనంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాడ మాట్లాడుతూ ఇప్పటంలో పేదల ఇళ్ల కూల్చివేతను ఖండించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామస్తులను పరామర్శకు వెళ్తే అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రోడ్లపై గుంతలు కప్పడం చేతగాని ప్రభుత్వానికి ఓ చిన్న గ్రామంలో కక్షపూరితంగా విధ్వంసం చేయడాన్ని ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. కూల్చివేతలతో ప్రారంభమైన ఈ ప్రభుత్వాన్ని కూల్చివేసే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు, పిడుగు సతీష్, కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, లోపింటి కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్పోర్టుకు కేంద్రం సహాయ నిరాకరణ

శంకుస్థాపనకు ముందుకు రాని ప్రధాని ● అయినా బ్రహ్మరథం పడుతున్న వైసిపి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోంది. కోర్టు అడ్డంకులు తొలగిపోయినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్రమోడీ ముందుకు రావడం లేదు. దీంతో మన జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందంటూ యూటర్న్ తీసుకున్నారు. అయినప్పటికీ త్వరలో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధానికి బ్రహ్మరథం పట్టేందుకు వైసిపి తహతహలాడుతోంది. మన జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

ఎయిర్పోర్టు, గిరిజన విశ్వవిద్యాలయాలకు ప్రధాని చేతులమీదుగా శంకుస్థాపన చేస్తారంటూ ఇటీవల మంత్రి బొత్స ప్రకటించిన విషయం విదితమే. ఇందుకోసం నేరుగా సిఎం కేంద్రంతో చర్చిస్తున్నట్టు కూడా చెప్పారు. గిరిజన వర్సిటీకి ఇంకా భూసేకరణ పూర్తికాలేదు. ఈనేపథ్యంలో వర్సిటీ పనుల ప్రారంభం మాట అటుంచితే ఎయిర్పోర్టు భూసేకరణకు సంబంధించి ఇటీవలే కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమయ్యాయి. దీంతో, ఓవైపు వైసిపి నాయకులు, మంత్రులు గొప్ప విజయంగా చెప్పుకుంటున్నప్పటికీ ఎయిర్పోర్టు శంకుస్థాపనకు ప్రధాని ససేమిరా ముందుకు రావడం లేదని సమాచారం. ఇందుకు కారణం లేకపోలేదు. ఎయిర్పోర్టు నిర్మాణానికి ఆర్థికంగా సాయం చేయాలని ఎన్నో సార్లు సిఎం జగన్మోహన్రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఇప్పటికీ ఎలాంటి స్పందనలేదు. కనీసం ప్రారంభోత్సవానికైనా సహకరిస్తారని అనుకుంటే చుక్కెదురైంది. దీంతో, ఎయిర్పోర్టు నిర్మాణం అదుగో పులి అంటే ఇదిగో మేక అన్నచందంగా మారింది. భోగాపురంలో మెయింటైనెన్స్, రిపేర్స్, ఓవరాల్ (ఎంఆర్ఒ)తోపాటు కార్గో సౌకర్యాలు, ఏవియేషన్ అకాడమీతో కూడిన ఎయిర్పోర్టు నిర్మాణానికి గతంలో టిడిపి హయాంలోనే ప్రణాళిక రూపొందించారు. టెర్మినల్ ఒకటో దశ పూర్తయ్యే నాటికి ఏటా 63 మిలియన్ల ప్రయాణికులకు సేవలు అందించగలుగుతుందని, రెండో దశ పూర్తిచేస్తే మరో 18 మిలియన్ల ప్రయాణికులకు సర్వీసు అందించవచ్చని అంచనాలు రూపొందించారు. ఈ నివేదికకు నాయ్ (ఎన్ఎఎఐ) కూడా ఆమోదం తెలిపింది. ఇందుకు 5,311 ఎకరాల భూమి సేకరించేందుకు సిద్ధపడినప్పటికీ ఆ స్థాయిలో భూములిచ్చేందుకు స్థానికులు నిరాకరించడం, పెద్దఎత్తున ఆందోళనలు చేయడంతో 2,703 ఎకరాలకు తగ్గింది. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండానే నిర్మాణ పనులకు టెండర్లు పిలిచారు. 13 నిర్మాణ సంస్థలు పాల్గొన్నప్పటికీ బిడ్ ఖరారు కాలేదు. అయినా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు హడావుడిగా 2019 ఫిబ్రవరి 14న నాటి సిఎం చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం వైసిపి అధికారంలోకి రాగానే పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) పద్ధతిలో ఎయిర్పోర్టు నిర్మించేందుకు జిఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 2023లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, నష్టపరిహారం చెల్లించి, భూసేకరణ పూర్తిచేసేందుకు రెండేళ్ల సమయం పట్టేసింది. సేకరించిన భూమిలో 500 ఎకరాలు మినహాయించి మిగిలిన 2,200 ఎకరాల్లో ఎయిర్పోర్టు నిర్మాణం చేపడతామని చెప్పడంతో మొత్తం ఎయిర్పోర్టు ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్న వాటిలో ఏవైనా తప్పిస్తారా? అన్న సందేహాలను ప్రభుత్వం ఇప్పటికీ నివృత్తి చేయలేదు. మరోవైపు ఎయిర్పోర్టు నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ కేంద్రం ఎలాంటి భరోసా ఇవ్వలేదు. లోటు బడ్జెట్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అంతమొత్తంలో నిధులు కేటాయించే పరిస్థితి లేదు. ఒప్పంద కాలపరిమితి సమీపిస్తుండడంతో ఎయిర్పోర్టు నిర్మాణానికి ఆర్థికంగా సహకరించాలంటూ సాక్షాత్తు సిఎం జగన్మోహన్రెడ్డి కేంద్రానికి పలుమార్లు విన్నవించారు. విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందాలంటే భోగాపురం అంతర్జాతీయ ఎయిర్పోర్టు నిర్మాణానికి సహకరించాలంటూ మార్చి 25న ప్రధాని మోడీ, హోం శాఖ, విమానయానశాఖ మంత్రులకు లేఖలు కూడా రాశారు. ఎన్ఒసి కోసం కూడా అందులో ప్రస్తావించారు. అయినా కేంద్రం నుంచి స్పందన రాలేదు. అయినప్పటికీ, ఈనెల 11, 12 తేదీల్లో ప్రధాని మోడీ విశాఖ పర్యటనకు భారీ ఏర్పాట్లతో బ్రహ్మరథం పట్టేందుకు అధికార పార్టీ సిద్ధమౌతోంది. వేలాది మందిని ప్రత్యేక వాహనాల్లో తరలించేందుకు సిద్ధపడడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో తలపెట్టిన గిరిజన వర్సిటీ, ఎయిర్పోర్టు నిర్మాణాలకు సహకరించకపోయినా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇవ్వకపోయినా బిజెపి ప్రభుత్వానికి వంతపాడడం వైసిపికి తగదని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు.



సమావేశమైన వైసిపి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు

విశాఖ సభను విజయవంతం చేయాలి

వైసిపి నాయకుల సమావేశంలో మంత్రులు రాజన్నదొర, బొత్స

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖలో ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఆదివారం విజయనగరంలోని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, జిల్లా ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 11, 12 తేదీల్లో ప్రధానమంత్రి విశాఖ పర్యటనలో భాగంగా సుమారు 12 వేల కోట్లతో వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రధానమంత్రిని గౌరవించేందుకు సిఎం జగన్ అధ్యక్షతన జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజలను తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో ఎమ్పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, పెనుమత్స సురేష్బాబు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణకు సమగ్ర ప్రణాళిక

- 3 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం ● క్లస్టర్ల విధానం ద్వారా కొనుగోలు
- పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం ● కాటాలు, ఇతర కొనుగోలు పరికరాలు సిద్ధం
- రవాణా, హమాలీ ఛార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుంది ● పారదర్శకత పెంపునకు ఎఫ్టిఒ విధానం
- 'ప్రజాశక్తి'తో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనా కుమారి ముఖాముఖి

ఈ ఏడాది ధాన్యం సేకరణకు సమగ్ర ప్రణాళిక రూపొందించామని, 3 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని సివిల్ సప్లై డిఎం మీనాకుమారి వెల్లడించారు. క్రయ, విక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురవకుండా తగిన పద్ధతులను ప్రభుత్వం అవలంబిస్తుందని వివరించారు. ఈ ఏడాది క్లస్టర్ల విధానం అమలు చేస్తున్నామని, అందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఇప్పటికే నియమించామని చెప్పారు. ధాన్యం నాణ్యతను పరీక్షించే యంత్రాలు, పనిముట్లు, ఎలక్ట్రానిక్ కాటాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కొద్ది రోజుల్లో గన్నీ బ్యాగులు కూడా అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఎప్పటి మాదిరిగానే రవాణా, హమాలీ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల మధ్యలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకునే పరిస్థితి ఎదురవకుండా ఎఫ్టిఒ విధానం అవలంబిస్తున్నామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి డిఎం మీనాకుమారి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరంప్రతినిధి

ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యం ఎంత?

ఈ ఏడాది జిల్లాలో 4.40 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని భావిస్తున్నాం. ఇందులో 3 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 4.03 మెట్రిక్ టన్నులు సేకరించాం. నేటి జిల్లాలోని 27 మండలాల పరిధిలో పరిశీలిస్తే 3.05 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీన్నిబట్టి ఈ ఏడాది కూడా 3 లక్షల టన్నులకు పైగా సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఈ ఏడాది ఎంఎస్పి ఎలా ఉంది?.


గత ఏడాదితో పోలిస్తే రూ.100 ఎంఎస్పి పెరిగింది. గతేడాది సాధారణ రకం క్వింటా రూ.1940 చొప్పున కొనుగోలు చేశాం. ఈ ఏడాది రూ.2040 ఎంఎస్పి ఉంది. గ్రేడ్ -1 రకం గత ఏడాది రూ.1960 కాగా ప్రస్తుతం రూ.2060 ఉంది.

ధాన్యం కొనుగోలులో అనుసరిస్తున్న పద్ధతులేమిటి?.

గతంతో పోలిస్తే ఈ ఏడాది అత్యంత సులువైన పద్ధతిలో పారదర్శకంగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది. గతేడాది ఆర్బికెల ద్వారా కొనుగోలు చేశాం. ఈ ఏడాది క్లస్టర్ విధానం అమలు చేస్తున్నాం. క్లస్టర్లో 3 నుంచి 4 ఆర్బికెలు ఉంటాయి. వెయ్యి మెట్రిక్ టన్నులలోపు, వెయ్యి మెట్రిక్ టన్నులపైనా, 2వేల మెట్రిక్ టన్నుల దాటిన వాటిని క్లస్టర్లు ఎ, బి, సి గ్రేడులుగా విభజిస్తున్నాం. ఆయా కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరుగుతుంది.

కొనుగోలు సిబ్బంది, పనిముట్ల విషయం ఏమిటి? .

జిల్లా వ్యాప్తంగా 510 ఆర్బికెలు ఉన్నాయి. వీటిని 244 క్లస్టర్లుగా విభజించాం. అన్నిచోట్లా టెక్నికల్ అసిస్టెంట్లను నియమించాం. 'ఎ' కేటగిరి క్లస్టర్లలో నలుగురు, బి, సి కేటగిరి క్లస్టర్లలో ముగ్గురు చొప్పున వాలంటీర్లను నియమించాం. రైతులకు, కొనుగోలు కేంద్రాలకు సహాయకులకు



సంధానకర్తలుగా పనిచేస్తారు. జిల్లాలో 760 వాలంటీర్లను నియమించాం. వీరికి నెలకు రూ.1500 చొప్పున గౌరవ వేతనం కూడా చెల్లిస్తాం. అన్ని క్లస్టర్లలోనూ ధాన్యం తేమ తదితర నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే సాధనాలు, తూనికలు కొలతల అధికారులు ధ్రువీకరించిన ఎలక్ట్రానిక్ యంత్రాలు, పనిముట్లు ఇప్పటికే సిద్ధంగా ఉంచాం. రైతులు నేరుగా క్లస్టర్లలోనే ధాన్యం విక్రయించుకోవచ్చు.

రవాణా ఛార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుందా? గన్నీ బ్యాగుల పరిస్థితి ఏమిటి?.

ఎప్పటి మాదిరిగా రవాణా ఛార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుంది. క్వింటాకు ఎంతవరకు చెల్లించాలనే దానిపై త్వరలోనే ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు రానున్నాయి. రవాణా ఛార్జీల విషయంలో రైతులు రాజీపడాల్సిన అవసరం లేదు. సంబంధిత క్లస్టర్లోనే దీనిపై మరింత క్లారిటీ తీసుకోవచ్చు. గన్నీ బ్యాగులు కూడా ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ఒక వేళ రైతులు తమ వద్ద ఉన్న బ్యాగుల్లో తెచ్చుకుంటే, వాటికి తమ సంస్థ తరపున బిల్లు చెల్లిస్తాం.

హమాలీ ఛార్జీలు ఎంత? గోడౌన్ల సమస్య ఏమైనా ఉందా?.

హమాలీ ఛార్జీలను క్వింటాకు రూ.25 చొప్పున ప్రభుత్వం తరపున చెల్లిస్తున్నాం. ఒక వేళ కూలీలను పెట్టుకోకుండా ఆ పని రైతులు చేసుకున్నా వారికి ఛార్జీలు చెల్లిసాం. జిల్లాలో గోడౌన్ల సమస్య లేదు.

ఏటా మిల్లర్ల వద్ద మోసపోతున్నామని రైతులు చెప్తున్నారు?.

ఇక నుంచి అటువంటి పరిస్థితులకు ఆస్కారమే లేదు. ఎందుకంటే ఈ ఏడాది నుంచి ఎఫ్టిఒ (ఫండ్ ట్రాన్స్ఫర్ ఆర్డర్) అమలు చేస్తున్నాం. సంబంధిత క్లస్టర్ సిబ్బంది ధాన్యం వివరాలు కంప్యూటర్లో అప్లోడ్ చేయగానే ఏ మిల్లుకు పంపాలన్నది కంప్యూటరే చెప్పేస్తోంది. కాబట్టి, ఇంతకు ముందులా కొనుగోలు కేంద్రం సిబ్బంది నచ్చిన మిల్లుకి, లేదా పక్కనే ఉన్న మిల్లుకు పంపడం సాధ్యం కాదు. దీనికితోడు తూకంలో మోసం లేకుండా లీగల్ మెట్రాలజీ అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించారు. రూట్ ఆఫీసర్లను నియమించాం. మిల్లుల్లో తమ తరపున కస్టోడియన్ ఆఫీసర్లను కూడా నియమించాం.

జిల్లాలో ఎన్ని మిల్లులు ఉన్నాయి? బ్యాంకు గ్యారెంటీలు చెల్లించారా?.

మన జిల్లాలో సుమారు 132 మిల్లులు ఉన్నాయి. కానీ, వీటిలో 80 మిల్లుల్లో మాత్రమే సార్టెక్స్ యంత్రాలు ఉన్నాయి. వీటికి మాత్రమే సేకరించిన ధాన్యాన్ని పంపిస్తాం. ఇంకా మిగిలితే ఎప్పటి మాదిరిగా తూర్పుగోదావరి జిల్లాకు పంపుతాం. కానీ, ఇక నుంచి ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. ఎందుకంటే గతంతో పోలిస్తే సార్టెక్స్ మిల్లుల సంఖ్య పెరిగింది. మిల్లు యజమానుల వద్ద బ్యాంకు గ్యారెంటీలు తీసుకుంటున్నాం.



అవోపా నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సేవా స్ఫూర్తిని కొనసాగించాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్యవైశ్య పూర్వీకులు ఇచ్చిన సేవా స్ఫూర్తిని మరింత ఇనుమడింప చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం విజయనగరంలోని ఎస్వీఎన్ నగర్లో సుజాత కన్వెన్షన్ సెంటర్లో జరిగిన అవోపా జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అవోపా జిల్లా అధ్యక్షులు బండారు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి తవ్వా మోహనరావు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యనారాయణ, సభ్యులను శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వధూవరుల వివాహ పరిచయ వేదిక సావనీర్ను కోలగట్ల ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటేనే సేవా రంగాల్లో ముందుంటారని భావన సమాజంలో నెలకొందన్నారు. ఆర్యవైశ్యుల్లో ఆర్థికంగా వెనుకబడి చాలామంది ఉన్నారనే విషయాన్ని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, మద్దాల గిరితో కలిసి సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనికి స్పందించిన సిఎం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. అనంతరం కోలగట్లను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తటవర్తి రాంబాబు, ఆరవేటి నిర్మల, ప్రగలపాటి కనకరాజు, ఆరిశెట్టి గున్నయ్య గుప్తా, బండారు బంగారు రాజు, కార్పొరేటర్లు బండారు ఆనంద్ బాబు, వజ్రపు గౌరి, కె.శ్రీనివాసరావు, వెచ్చ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


నగరంలోని దాసన్నపేట ఏనుగుతోటలోని కాళికాదేవి ఆలయాన్ని బోనాల మహోత్సవ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కోలాటం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.మాలతి, నిర్వాహకులు బి.ఈశ్వరరావు, బొద్దాన అప్పారావు, పి.గోపి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న జెసి రాజు

జెసి రాజుకు రోటరీ పురస్కారం

బొబ్బిలి: రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ స్థాపకుడు పాల్ హారీస్ పేరుపై వున్నా 'పాల్ హారీస్ ఫెలో' (పిహెచ్ఎఫ్) పురస్కారాన్ని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అందుకున్నారు. ఆదివారం విశాఖపట్నంలో వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఆర్‌పిఎల్ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎకెఎస్ భాస్కర్ రామ్ పిహెచ్ఎఫ్ పురస్కారాన్ని పాల్ హారీస్ ప్రతిమతో ఉన్న ఫిన్ను సర్టిఫికెట్‌ను జెసి రాజుకు అందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తీక్ మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ సేవా విభాగమైన రోటరీ ఫౌండేషన్‌కు రూ.80వేలు విరాళాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర్ రామ్ సమక్షంలో జెసి రాజు అందించారని అన్నారు. రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విస్తృత సేవా కార్యక్రమాలకు గాను రోటరీ ఇంటర్నేషనల్ పిహెచ్ఎఫ్ పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ జి.శ్రీనివాసరావు, ఒకేషనల్ ట్రైనింగ్ చైర్ కిషోర్, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసన్ పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.


యనమలను కలిసిన రేగిడి మండల నాయకులు

'రాజాం టిక్కెట్ ప్రతిభా భారతికివ్వాలి'

రేగిడి: మండల టిడిపి క్యాడర్ రాష్ట్ర టిడిపి పరిశీలకులు యనమల రామకృష్ణడును, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి నివాసంలో మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. మాజీ జెడ్‌పిటిసి కిమిడి రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో మండల క్యాడర్ ప్రతిభా భారతకే రాజాం ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని కోరారు. ప్రతిభా భారతికి టికెట్ కేటాయిస్తే గెలుపు ఖాయమని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టిడిపికి పూర్వ వైభవం తెచ్చేందుకు సమిష్టి కృషితో సైనికుల్లా పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లానన్నారు. ఆయన్ను కలిసిన వారిలో నాయకులు టెంటు కృష్ణ, టంకాల గోవిందరావు, గాదం రామ్మూర్తి, లావేటి సత్యనారాయణ, గేదెల అప్పలనాయుడు, శ్రీధర్, ఆదినారాయణ, దొర, కర్నేని మహేష్, అంబఖండీ టిడిపి నాయకులు బెవర రాంబాబు, కొమ్ము శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ఘనంగా పెరల్ వార్షికోత్సవ వేడుకలు


బొబ్బిలి : స్థానిక బ్రహ్మకుమారిస్ సంస్థ బొబ్బిలిలో స్థాపించి 30 సంవత్సరాలైన సందర్భంగా శని, ఆదివారాలు రెండు రోజులు పాటు సూర్య రెసిడెన్సిలోని బికె టీచర్ అక్కయ్య రాజేశ్వరి ఆధ్వర్యంలో పెరల్ యానివర్సిరీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మ కుమారిస్ టీచర్ అక్కయ్యలు, విద్యార్థులు, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా నుంచి సుమారు 300 మంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో జ్ఞాన, యోగాలు, సంస్కృతిక కార్యక్రమాలు, మనిషి పరివర్తనకు కావలసిన జ్ఞాన పాయింట్స్ మొదలైన వాటిపై చర్చించారు.

కోర్టు ఆదేశాలు అధికార పార్టీకి పట్టవా?


గొంప వెంకటరావు

వేపాడ: కోర్టు ఆదేశాలు అధికార పార్టీకి పట్టవా? అని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు నమోదు కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు ప్రమేయం ఉండకూడదని న్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ వైసిపి నాయకులు పట్టించుకోకుండా సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామ వాలంటీర్లకు బాధ్యతలు అప్పగించడం సిగ్గుచేటన్నారు. గ్రామ సర్పంచులు సైతం సమావేశం ఏర్పాటు చేసి హుకుం జారీ చేయడం కోర్టు ఆదేశాలు ధిక్కరించడం కాదా? అని అన్నారు. ఫారాలు తీసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న వాలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాడైన ప్యానల్ బోర్డు


మరమ్మతుకు గురైన ప్యానల్ బోర్డు

బొబ్బిలి: మున్సిపల్ ప్రధాన పంపు హౌస్‌లో ప్యానల్ బోర్డు పాడైపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆదివారం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోర్డు బాగు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరణ చేస్తామని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయాలు


బానాది సచివాలయం

వేపాడ : మండలంలోని బానాది, వల్లంపూడి, దబ్బిరాజుపేట, సింగరాయి గ్రామాలలో నిర్మించిన గ్రామ సచివాలయాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాలకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులు వస్తే తప్ప ప్రారంభించడానికి అంగీకరించక పోవడంతోనే నిలిచిపోయినట్లు తెలిస్తోంది. ఆయా గ్రామ సర్పంచులు, కాంట్రాక్టర్లు ఈ సమస్యను పలుమార్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

రక్తదానం ఎందరికో ప్రాణదానం



రక్తదానాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రమణరావు

విజయనగరంకోట : రక్తదానం ఎందరికో ప్రాణదానమని వెంకట రామ ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు తెలిపారు. ఆదివారం వెంకటరామ ఆస్పత్రిలో రమణారావు కుమారుడు చిట్టి వైష్ణవ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా వైష్ణవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రమణారావు, ఆమ్ఆద్మీ పార్టీ నాయకులు దయానంద్ మాట్లాడుతూ రక్తం అత్యవసర సమయాల్లో అనేకమందికి ఉపయోగపడుతుందన్నారు. వైష్ణవ్ పేరుతో నిర్వహిస్తున్న హార్ట్ కేర్ సెంటర్ ద్వారా ఎంతో మందికి అతి తక్కువ ఫీజులతో వైద్యం అందిస్తున్నట్లు రమణారావు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో 'ఆట'ంకం

● ఆట స్థలాలున్నా.. అభివృద్ధి కాకపోవడంతో వెనుకడుగు ● రాళ్లు తేలిన మైదానంలో ఆటలెలా అని విద్యార్థుల ప్రశ్న ● బాగు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - వేపాడ

ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆట స్థలాలున్నా వాటిని అభివృద్ధి చేయకపోవడంతో క్రీడలకు ఆటంకం కలుగుతోంది. దీంతో చదువుల్లో చురుగ్గానే ఉంటున్న విద్యార్థులు ఆటల్లో డల్ అవుతున్నారు. ఉన్న ఆట స్థలాల్లో రాళ్లు తేలడం, పిచ్చి మొక్కలు ఉండటంతో క్రీడలు సాధ్యం కావడం లేదని వాపోతున్నారు. మైదానాలను బాగు చేస్తే క్రీడల్లో సత్తా చాటుతామని చెబుతున్నారు.


కస్తురిభా మైదానంలో వేపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, తేలిన రాళ్లు..

మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బక్కు నాయుడుపేట ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూరిబా బాలికల వసతి గృహం, బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న సుమారు 2వేల మంది విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ఈ విద్యా సంస్థల్లో ఆట స్థలాలున్నా అవి క్రీడలకు పనికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో అధిక శాతం బాలికలు వసతి గృహాల్లో ఉండటంతో క్రీడలకు అధిక సమయం ఉన్నా మైదానాల్లో రాళ్లు, కంకర, ముళ్ల పొదలు ఉండడం వల్ల క్రీడలకు ఆటంకం కలుగుతోంది.

క్రీడల్లో డల్ అవుతున్న విద్యార్థినులు

ఆట స్థలాలు బాగోకపోవడంతో విద్యార్థినులు క్రీడల్లో డల్ అవుతున్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం అని చెప్పే ప్రజాప్రతినిధులు ఆ దిశగా సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. చదువుల్లో ఒత్తిడి ఉన్న సమయాల్లో ఉదయం సాయంత్రం ఆటలు ఆడితే కొంత ఉపసమనం కలిగే పరిస్థితి ఉన్నా ఇక్కడ ఆడేందుకు ఆస్కారం లేక విద్యార్థులు కాస్త ఒత్తిడికి లోనవుతున్నారని చెప్పారు.

పలుమార్లు చెప్పినా..

వసతి గృహాల మైదానాలను బాగుచేయాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతుంది. ఈ మధ్యకాలంలో కస్తూరిబా బాలికల వసతి గృహానికి వచ్చిన సమగ్ర శిక్ష ఎపిసి స్వామి నాయుడు పరిశీలనకు వచ్చిన సందర్భంలో వసతి గృహం ఆవరణలో ఉన్న రాళ్ళను, దొంకను తాత్కాలికంగా తొలగించినప్పటికీ కంకర తేలిపోవడంతో ఆటలకు అంతరాయం ఏర్పడుతోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా మైదానాలను శాశ్వతంగా అభివృద్ధి చేస్తే విద్యార్థులకు మేలు చేకూరుతోందని అధ్యాపక బృందం కోరుతుంది.


పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ఎపి మోడల్ స్కూల్ మైదానం


ప్రమాణాలు పాటిస్తేనే భద్రత

విద్యుత్తు వినియోగదారులకు సూచనలు

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. విద్యుత్ ప్రమాదలలో మూగ జీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ భద్రత పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. భద్రత ప్రమాణాలపై విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాదాలు నివారణపై అవగాహన


ఇఇ పూడి హరి

విద్యుత్ ప్రమాదాలు నివారణపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామని విద్యుత్ శాఖ ఇఇ పూడి హరి అన్నారు. పట్టణ, గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేస్తున్నామన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణకు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని ప్రజలను కోరారు.

ఇవి పాటించాల్సిందే...

- ఇంటికి వైరింగ్ చేసేటప్పుడు ఐఎస్ఐ గుర్తింపు పొందిన విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు వినియోగించాలి.
- ఇంటిలోని స్విచ్ బోర్డులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఎత్తులో అమర్చుకోవాలి.
- విద్యుత్ మీటరు నుంచి స్తంభానికి వేసే వైరు లోడ్‌కు అనుగుణంగా కెపాసిటీ కలిగిన నాణ్యమైనది వేసుకోవాలి.
- ప్రతి విద్యుత్ సర్వీసుకు, ఇంటిలో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరిగా ఎర్త్ వైరు ద్వారా ఎర్తింగ్ ఇవ్వాలి.
- వర్షం పడుతున్నప్పుడు, నేల పదునుగా ఉన్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టకూడదు.
- ఇల్లు, అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్ నిర్మాణ పనులు జరిగినప్పుడు విద్యుత్ లైన్, స్తంభాలు ఉంటే వైర్లకు ఐరన్, ఇతర సామగ్రి తగలకుండా పని చేయాలి.
- విద్యుత్ లైన్లకు దూరంగా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేయాలి.
- తడి చేతులు, కాళ్లు తడిగా ఉన్నప్పుడు విద్యుత్ స్విచ్‌లు ముట్ట కూడదు.
- ఇళ్ల డాబాలపై బట్టలు ఆరవేసేటప్పుడు విద్యుత్ వైర్లను చూసుకుని ఆరబెట్టాలి.


చెరువులో పడిపోయిన విద్యుత్ స్తంభం

- కొబ్బరి, పామాయిల్, మామిడి, టేకు తోటలలో చెట్టు కొమ్మలు తొలగిస్తే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి వారి పర్యవేక్షణలో లైన్ క్లియరెన్స్ తీసుకుని కొమ్మలను తొలగించాలి.
- తోటలు, పొలాల్లో, చెరువులు వద్ద విద్యుత్ ప్రసారం జరిగే వైర్లు తెగి కింద పడితే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారమివ్వాలి.
- విద్యుత్ వైర్లు తెగి కింద పడితే నేరుగా ముట్టకుండా విద్యుత్ అధికారులకు సమాచారమివ్వాలి.
- విద్యుత్ పరికరాలు రిపేర్ చేస్తే తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలి.

వాలంటీరకు నియామక పత్రం

బొండపల్లి : మండలంలోని నెలివాడకు చెందిన నీలాతి రామాంజనేయులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య చేతులు మీదుగా గ్రామ వాలంటీర్ నియామక పత్రాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వాలంటీర్లు వారధులుగా ఉన్నారన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా వాలంటీర్లు కృషి చేయాలని కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్లా చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్య ప్రకాశరావు, బొండపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు బివి ప్రభూజీ, మండల వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బొత్స

మతం మారలేదని కరెంట్ కట్..!

ప్రజాశక్తి - బాడంగి

మతం మరలేదని విద్యుత్ కనెక్షన్ కట్ చేసిన సంఘటన బాడంగి మండలం ఎరుకులపాకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎరుకుల పాకలో నివాసముంటున్న గజరాయునివలస టిడిపి ఎంపిటిసి పాలవలస గౌరును మతం మారాలని రెండు నెలలు క్రితం విద్యుత్ శాఖలో పని చేస్తున్న జూనియర్ అకౌంట్ ఆఫీసర్ అడిగారు. తాను మతం మారలేనని గౌరు చెప్పడంతో కక్షసాధింపుగా విద్యుత్ బిల్లు బకాయి ఉందని షాక్‌గా చూపించి విద్యుత్ బిల్లు చెల్లించాలని నోటీసు, ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్ కనెక్షన్‌ను గతనెల 15న కట్ చేశారు. దీంతో గౌరు అప్పటి నుంచి చీకటిలోనే ఉంటున్నాడు. 2016లో పాలవలస చిన రాములు దగ్గర ఇంటిని పాలవలస గౌరు కొనుగోలు చేశారు. అప్పటికే ఆ ఇంటికి ఉన్న విద్యుత్ మీటరును వినియోగిస్తున్నారు. 2020 ఫిబ్రవరిలో విద్యుత్ బిల్లు రూ.27వేలు రావడంతో విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా మీటర్ స్టక్ అయిందని చెప్పి పాత మీటరు తీసేసి కొత్త మీటరు పెట్టారు. అప్పటిలో వచ్చిన విద్యుత్ బిల్లు చెల్లించాలని అధికారులు చెప్పలేదు. ఎస్‌టిలకు విద్యుత్ సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వడంతో విద్యుత్ బిల్లు పూర్తిగా రావడం లేదు. ఇటీవల కాలంలో విజయనగరం నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగి మతం మారాలని గౌరును కోరగా అంగీకరించకపోవడంతో విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు. ఆ ఇంటి పక్కనే ఉన్న మరో విద్యుత్ మీటరు కనెక్షన్ కూడా కట్ చేశారు. అక్కడితో ఆగకుండా కోళ్ల ఫారంకు వెళ్లే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో 60 కోళ్లు మరణించాయని గౌరు వాపోయారు. మతం మారలేదని కక్షసాధింపునకు పాల్పడిన విద్యుత్ శాఖ ఉద్యోగి జయరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గౌరు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఎఇ తెంటు శ్రీనివాసరావును వివరణ కోరగా బిల్లు కట్టలేదని ఆయనతో పాటు నలుగురుకు పవర్ కట్ చేశామన్నారు.

ఎరుకులపాకలో విద్యుత్తు ఉద్యోగి అత్యుత్సాహం


విద్యుత్తు నిలుపుదల చేసిన ఇల్లు ఇదే..

అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి అవినీతి, అక్రమాలను జనసేన ప్రశ్నిస్తే దాడుల చేస్తారా అని ఆ పార్టీ నియోజకవర్గం నాయకులు లోకం మాధవి నిలదీశారు. ఆదివారం జనసేన ఆధ్వర్యంలో వైసిపి దాడులకు నిరశనగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రామతీర్థం జంక్షన్‌లో ప్రారంభమై బూరాడ పేట, కొండ వెలగాడ, గుషిని, అలుగోలు, సతివాడ గ్రామాల్లో తిరిగింది. లోకం మాధవి మాట్లాడుతూ ఇప్పటంలో అధికార వైసిపి అన్యాయంగా పేదల ఇల్లు తొలగించడం దారుణమన్నారు. పవన్ కళ్యాణ్‌ను చూసి అధికార వైసిపి భయపడి హత్య చేయడానికి రెక్కీ నిర్వహించిదని ఆరోపించారు. ఈ ర్యాలీలో జనసేన నాయకులు బాబూ పాలూరి, పిడుగు జోగారావు, పల్ల రాంబాబు, నెల్లిమర్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : పోరాట యోధుల విగ్రహాలు తొలగించడం, పేదల ఇళ్లను కూల్చడంతో ఈ ప్రభుత్వం కుట్రపూరిత పాలన చేస్తుందంటూ పూసపాటిరేగ బ్రిడ్జి కింద జన సేన నాయకులు నల్లబ్యాడ్జిలు దరించి ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు బూర్లె విజయశంకర్ మాట్లాడుతూ జాతీయ నాయకులు విగ్రహాలు కూల్చి వైఎస్ఆర్ విగ్రహాన్ని ఉంచడం జాతీయ నాయకులను అవమానించడమేనన్నారు. తమ అధినాయకుడుపై జరుగుతున్న కుట్రలు కుతంత్రాలు తనను ఏమీ చేయలేవన్నారు. జనసేన ఎపిలో బలమైన పార్టీగా మారిందన్నారు. అనంతరం పూసపాటిరేగలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలు వేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు తుమ్మి లక్ష్మిరాజ్, అప్పలరాజు, మాదేటి బుజ్జి, బలబధ్రుని జానకీరాం తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్లలో ర్యాలీగా వెళ్తున్న జనసేన నాయకులు

ఒహెచ్ఎ రికవరీ దుర్మార్గం

ప్రజాశక్తి - వంగర, రాజాం

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల వృత్తి ఆరోగ్య భత్యాన్ని(ఒహెచ్ఎ) రికవరీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని, తక్షణమే హెల్త్ అలవెన్స్ రికవరీ ఉత్తర్వుల ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ 2019 ఆగస్టు నుండి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ చెల్లిస్తుందని, 2022 జనవరి నుండి నిలుపుదల చేస్తే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేసి పోరాడి మళ్ళీ సాధించుకున్నామని, ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా జనవరి నుండి చెల్లించిన ఒహెచ్ఎను రికవరీ చేయాలని కోరుతూ తెనాలిలో ట్రెజరీ, మున్సిపల్ అధికారులకు గత నెల 22న ఆదేశాలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు అలెవెన్స్ రికవరీ చేయాలని ఆదేశాలు ఇవ్వడం పిచ్చి తుగ్లక్ పరిపాలనకు తార్కాణమన్నారు. ఈ చర్యను విరమించుకోకపోతే రానున్న కాలంలో మున్సిపల్ కార్మికులు సమ్మెకు వెనకాడబోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, శంకర్రావు, గిరి, కృష్ణ, చినబాబు, అనిల్ కుమార్, కనకరాజు, లక్ష్మి, సుగుణ, కాశీ, గోపి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజా సంకల్ప యాత్ర సంబరాలు

డెంకాడ: వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు ఐదు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మండలంలో చింతవలస గ్రామంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, నాయకులు పిన్నింటి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మొయిద జంక్షన్‌లో సంకల్పయాత్ర సంబరాల్లో భాగంగా వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపిపి అంబళ్ళ సుధారాణి, మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, చిక్కాల సాంబ శివ రావు, అంబళ్ళ శ్రీరాములు నాయుడు, నగర పంచాయతీ ఛైర్మెన్ బంగారు సరోజినీ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నగర పంచాయతి వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైస్ ఎంపిపి పతివాడ సత్య నారాయణ, తుమ్మల పేట, మొయిద పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, అట్టాడ కనకా రావు, విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్, రోడ్ల భవనాలు డైరెక్టర్ జనా ప్రసాద్, వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

బొబ్బిలి: పాదయాత్రలో ప్రజలు నుంచి వచ్చిన సమస్యలను వైసిపి ప్రభుత్వం పరిష్కరించిందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. పాదయాత్ర ఐదేళ్ల పూర్తి ఆయన సందర్భంగా అమ్మిగారి కోనేరు గట్టుపై ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి, పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, పాల్గొన్నారు.


డెంకాడ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఫర్ ద పీపుల్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కొత్తవలస

ఫర్‌ద పీపుల్ సేవలు అభినందనీయమని సిఐ బాలసూర్యారావు అన్నారు. ఆదివారం స్థానిక తుమ్మికాపల్లి గ్రామంలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ ఆధ్వర్యంలో 33 మంది ఒంటరి వృద్ధులకు పన్నెండు రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ హాజరై మాట్లాడారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న ఫర్ ద పీపుల్ సేవా సంస్థ సభ్యులందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ట్రస్ట్ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి చేరుకోవాలని మరింత పేరు పొందాలని ఆకాంక్షించారు. తాను కూడా ఒక మారుమూల గ్రామానికి చెందిన వాడినని, అక్కడున్న వాళ్ళందరికీ కూడా లైబ్రరీ, జిమ్ సదుపాయాలు కూడా కల్పిస్తున్నానని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ట్రస్టులో మెంబర్‌గా చేరాలని వృద్ధులను ఆదుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలందించిన ఎల్.టి. కృష్ణారావు, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయి రమణ, ట్రస్టు సభ్యులకు ప్రత్యేఖమైన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సి.ఐ బాలసూర్యారావుకు ట్రస్టు సభ్యులు శాలువా పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, లీగల్ ఎడ్వయిజర్ గవర కృష్ణా, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రావణ్, మెంబర్స్ ఈశ్వర్, నగేష్, గోవిందరావు, రవి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు నిత్యావసరాలు అందిస్తున్న సిఐ, ట్రస్ట్ సభ్యులు

వరి కోతలకు రైతులు సిద్ధం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో రైతులు వరి కోతలకు సిద్ధమవుతున్నారు. శనివారం తుపాను వస్తుందని ప్రచారం జరగడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే ఆదివారం వాతావరణంలో మార్పులు వచ్చి ఎండ కాయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా కొంత మంది రైతులు వరి కోతలకు సిద్ధమవుతున్నారు. ఏ క్షణమైనా వర్షం పడితే చేతికిందని పంట పోవడమే కాక పెట్టిన పెట్టుబడి కూడా కోల్పోయి అప్పుల పాలవుతామని రైతులు ఆందోళణ చెందుతున్నారు.


కోతకు సిద్ధంగా ఉన్న వరి మడి

నత్తనడకన జగనన్న కాలనీ పనులు


పునాదుల స్థాయిలో నిలిచిన ఇళ్లు

వేపాడ : మండలంలోని బల్లంకిలో 38 పేద కుటుంబాలకు జగనన్న కాలనీలను కేటాయించారు. అయితే ఇప్పటి వరకూ కేవలం ఆరుగురే నిర్మాణ పనులను ప్రారంభించారు. మిగిలిన వారు రోజు వారీ కూలీ ధరలు, సామాగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణాలకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో కాలనీ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఊరికి చివరన ఉన్నందున మరి కొంతమంది నిర్మాణ పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదు.